## రిపోర్టర్లు కావలెను

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం : 9502535152, 7416812467



ఆదివారం 30.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -146 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00


## చంద్రబాబు కార్యసాధకుడు

### అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తారు: సుమన్



**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యసాధకుడు అని ప్రముఖ సినీ నటుడు సుమన్ కొనియాడారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "చంద్రబాబు పాలనలో అమరావతి రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతోంది. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించబోతున్నారు. గతంలో ఉద్యోగాలు లేకుండా యువత ఎన్నో ఇబ్బందులు పడ్డారు. సినీ పరిశ్రమలోని వారు కూడా పలు సమస్యలను ఎదుర్కొన్నారు. సబ్జెక్ట్ తెలిసిన వ్యక్తి పవన్ కల్యాణ్కు మంచి శాఖలనే కేటాయించారు. ఉపముఖ్యమంత్రిగా ఆయన తన సత్తా చూపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలు సమసిపోతాయన్న నమ్మకం ఉంది. అలీ రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పడం ఆయన వ్యక్తిగతం. అయితే సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికీ పదవులు దక్కుతాయని అనుకోవడం కరెక్ట్ కాదు. ప్రజా సేవ చేస్తే పదవులు వాటికవే వస్తాయి" అని సుమన్ తెలిపారు.

## తిరుమల ఈడీపీ ఆఫీస్‌లో మంటలు..

- డేటా తగులబెట్టేందుకు యత్నించారా అనే అనుమానాలు



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైకుంఠం ఎదురుగా వున్న ఈడీపీ ఆఫీస్‌లో మంటలు చెలరేగాయి. ఏసీ కంప్రెజర్ నుంచి మంటలు చెలరేగడంతో ఫైర్ అలారం మోగింది. దీంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. గత కొద్ది రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ క్రమంలోనే మంటలు చెలరేగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈడీపీ ఆఫీస్‌లోని తిరుమలకు సంబంధించిన డేటాని తగలబెట్టేందుకు మంటలు పెట్టారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫైర్ అలారం మోగడంతో పెను ప్రమాదం తప్పింది.

2 లో

## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత

వివరాలు 2 లో

# ప్రతి ఒక్కరికి అండగా...

# ప్రజా ప్రభుత్వం



- ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చటమే మన ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం
- మ్యానిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్‌ను ఒకేసారి రూ. 1000 పెంచాం. ఇకపై రూ.4000 పెన్షన్
- కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు
- పెన్షన్ల పెంపు వల్ల నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం
- అయినా ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి
- పెన్షన్ దారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ
- స్వయంగా పెన్షన్లు పంపిణీ చేయనున్న సీఎం
- దేశ చరిత్రలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం పెన్షన్ పంపిణీ చేయడం ఇదే మొదటిసారి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెన్షన్ దారులకు లేఖ రాశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని అందులో పేర్కొన్నారు. 'మీ అందరి మద్దతుతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. మీకు అండగా నిలుస్తూ, సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది. మీ ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే తక్షణ కర్తవ్యం. ఎన్నికలకు ముందే మ్యానిఫెస్టోలో చెప్పినట్లు పెన్షన్‌ను ఒకేసారి రూ. 1000 పెంచాం. ఇకపై రూ. 4000 పెన్షన్ ఇస్తాం. దివ్యాంగులకు రూ. 3000 పెంచి, ఇకపై రూ. 6000 ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది అని' చంద్రబాబు అభిప్రాయ పడ్డారు.

**పెంచిన పెన్షన్ అందిస్తాం**

'28 వర్గాలకు చెందిన 65,18,496 మంది పెన్షన్ లబ్ధిదారులకు జూలై 1వ తేదీ నుంచే పెంచిన పెన్షన్లు ఇంటి వద్ద అందిస్తాం. కొత్త ప్రభుత్వం ముందు అనేక ఆర్థిక సమస్యలు ఉన్నాయి. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే మంచి చేసే నిర్ణయాలు తీసుకున్నాం. పెన్షన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ. 819 కోట్ల భారం పడుతుంది. ప్రజా శ్రేయస్సు కోసం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి తీసుకొచ్చాం. ఎన్నికల సమయంలో వికృత రాజకీయాల కోసం ఆ నాటి అధికార పక్షం మిమ్మల్ని పెన్షన్ విషయంలో ఎంతో క్షోభకు గురిచేసింది. ఆ మూడు నెలలు మీరు పింఛన్ అందుకోవడానికి పడిన కష్టాలు చూసి నేను చలించిపోయా. మండుటెండలో, వడగాల్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూశా. ఏప్రిల్ నెల నుంచే పెన్షన్ పెంపును వర్తింపచేస్తానని మాటిచ్చాం. ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా పెంపును వర్తింప చేసి మీకు అందిస్తున్నాం. మూడు నెలలకు పెంచిన రూ. 3000, జూలై నెల పింఛన్ రూ. 4000 కలిపి మొత్తం రూ. 7000 మీ ఇంటికి తెచ్చి ఇస్తున్నాం అని' సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఎన్టీఆర్ పేరుతో పెన్షన్ల పంపిణీ**

'సంక్షేమ పాలకుడు, సామాజిక పెన్షన్ విధానానికి ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ పేరును పెన్షన్ల కార్యక్రమానికి పెట్టాం. ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇకపై మీ ఇంటి వద్దకొచ్చి సామాజిక పెన్షన్ల పంపిణీ జరుగుతుంది. పెరిగిన పెన్షన్‌తో మీకు ఆర్థిక స్వావలంబన, భరోసా లభిస్తుందని ఆశిస్తున్నాం. ప్రజా భద్రత మా బాధ్యత. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాం. ఎప్పుడూ మంచి చేయాలని చూసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించమని కోరుకుంటున్నా అని' ఆ లేఖలో చంద్రబాబు కోరారు.

**స్వయంగా పెన్షన్లు పంపిణీ చేయనున్న సీఎం**

తాడేపల్లి మండలం పెనుమాకలో పెన్షనర్ల ఇంటికి వెళ్లి పెన్షన్లను తన చేతుల మీదుగా అందజేయనున్నారు. దేశ చరిత్రలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సీఎం పెన్షన్ పంపిణీ చేయడం ఇదే మొదటిసారి. పేదింటి మహిళకు సీఎం స్వయంగా పెన్షన్ అందచేయడం ఇదే ప్రథమం. సీఎం పర్యటనతో పెనుమాక వచ్చి అధికారులు పరిశీలించారు. పెన్షన్ లబ్ధిదారుల జాబితా అధికారులు సేకరించారు.

చంద్రబాబు చేతుల మీదుగా ఫింఛన్ అందుకునేది వీరే.. మంగళగిరి నియోజకవర్గం పెనుమాక గ్రామంలో సుగాలి తండాకు చెందిన తండ్రి, కూతుళ్లకు జూలై నెల 1న ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు పెన్షన్ ఇవ్వనున్నారు. పెనుమాక గ్రామానికి చెందిన ఇస్లావత్ సాయికి ఒంటరి మహిళా పెన్షన్ కింద పెంచిన రూ. 1000తో కలిపి రూ. 4000 వేలు ఏప్రిల్, మే, జూన్‌లో పెంచిన పెన్షన్ రూ. 3 వేలు కలిపి మొత్తం రూ. 7వేలు స్వయంగా అందించనున్నారు. ఆమె తండ్రి బానావత్ పాములుకు పెంచిన వెయ్యి రూపాయిలతో కలిపి రూ. 4 వేలు ఏప్రిల్, మే, జూన్ నెలలను కలిపి మొత్తం మొత్తంగా రూ. 7 వేలు స్వయంగా అందజేస్తారు. కాసేపు బానావత్ పాముల ఇంటి వద్దే ఉండి అక్కడ నుంచి అంగన్వాడీ కేంద్రానికి కాలినడకన చేరుకోనున్నారు. అంగన్వాడీ కేంద్రం ముందున్న చెట్టు వద్ద నిలబడి గ్రామస్థులతో

2 లో


## ఉదయం 6 గం.లకే ఫించన్ల పంపిణీ మొదలవ్వాలి

- ఫించన్ల పంపిణీలో నిర్లక్ష్యం జరిగితే కఠిన చర్యలు తప్పవు.
- మొదటి రోజే నూరు శాతం ఫించన్ల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకోండి.
- ఫించన్ల పంపిణీకి గ్రామ,వార్డు సచివాలయాల తోపాటు ఇతర విభాగాల సిబ్బంది సేవలను వినియోగించుకోండి.
- ఫించన్ మొత్తం తోపాటు సియం లేఖను కూడా ఫించన్ దారులకు అందించాలి.
- చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్.

2లో



## శరవేగంగా అమరావతి అభివృద్ధి పనులు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అమరావతి ప్రాంతంలో చేపట్టనున్న ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతిలో ప్రభుత్వ కాంప్లెక్స్ భవనాలు నిర్మించనున్నారు. ప్రభుత్వ కాంప్లెక్స్ ప్రాంతమైన 1575 ఎకరాల ప్రాంతాన్ని సీఆర్డీఏ నోటిఫై చేసింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. సీఆర్డీఏ చట్టం సెక్షన్ 39 ప్రకారం బహిరంగ ప్రకటనను జారీ చేసింది. రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేసినట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ వెల్లడించారు.

## తక్కువ ధరకే రుచికరమైన భోజనం



**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమలలోని హొటళ్లపై టీటీడీ నూతన ఈఓ జె. శ్యామలరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుమలకు వచ్చే భక్తులకు తక్కువ ధరలకే రుచికరమైన, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని టీటీడీ ఈవో తెలిపారు. ఇందుకోసం ప్రముఖ హొటళ్ల జాబితాను రూపొందించేందుకు ఇండియన్ క్యులినరీ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు చలేశ్వరరావు, తాజ్ హొటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించారు. మరోవైపు టీటీడీ ఐటీ విభాగం అందిస్తున్న సేవలపై టీటీడీ ఈవో సమీక్ష కూడా నిర్వహించారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయాన్ని టీటీడీ ఈవో తనిఖీ చేశారు. అక్కడ యాత్రికులకు అందిస్తున్న రుచికరమైన వంటకాలను స్వయంగా పరిశీలించారు. టీటీడీ అందిస్తున్న ప్రసాదాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల సూచనల మేరకు అన్నప్రసాదాన్ని మరింత రుచిగా అందించాలని అధికారులను ఆదేశించారు.

## ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

**నిజామాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) కనుమూశారు. ఆయన శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో హైదరాబాద్‌లోని తన నివాసంలోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆదివారం సాయంత్రం నిజామాబాద్‌లో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలియగానే పెద్ద కుమారుడు, మాజీ మేయర్ సంజయ్ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లిపోయారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఢిల్లీ నుంచి బయలుదేరారు.

కాగా కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. క్రిటికల్ సర్జరీ తరువాత డీఎస్ పూర్తిగా తన ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంది. అనేక నెలలుగా డీ ఎస్ ఇంటికే పరిమితం అయ్యారు. డీఎస్‌ను కుటుంబ సభ్యులు కొంతకాలంగా ఎవరినీ కలవనీయడం లేదు. చివరకు ఇవాళ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

. కాంగ్రెస్ కండువా కప్పుకుని చనిపోవాలన్నది ఆయన అంతిమ కోరికగా చెప్పుకునే వాడు. అలాగే ఇటీవల తన పెద్ద కుమారుడు మాజీ మేయర్ సంజయ్ నీ పార్టీలో చేర్పించడానికి ఆయన తో పాటు గాంధీ భవన్ కు వెళ్లారు. కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తుదకు కాంగ్రెస్ లోనే తన శ్వాశ వదిలారు. రాజకీయాల్లో తనదైన శైలితో విలక్షణ నేతగా గుర్తింపు పొందారు.

**డి. శ్రీనివాస్ ప్రస్థానం :** ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన డీఎస్.. 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్‌లో జన్మించిన డి. శ్రీనివాస్.. 1989,1999,2004లో ఎమ్మెల్యేగా ఎన్నికైనా డీఎస్.. 2004, 2009 ఎన్నికల సమయంలో పీసీసీ చీఫ్‌గా పని చేసిన డీఎస్.. 2014 తర్వాత కాంగ్రెస్?కు రాజీనామా చేసి బీర్ఎస్?లో చేరిన డి. శ్రీనివాస్.. బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన డీఎస్.. అనంతరం బీఆర్ఎస్?ను వీడి సొంతగూటి కాంగ్రెస్?లో చేరిన డీఎస్.. డి. శ్రీనివాస్?కు భార్య, ఇద్దరు కుమారులు.. నిజామాబాద్ మేయర్?గా పని చేసిన డీఎస్ పెద్ద కుమారుడు సంజయ్.. నిజామాబాద్ బీజేపీ ఎంపీగా ఉన్న రెండో కుమారుడు ధర్మపురి అర్వింద్..



**డీఎస్ కు ప్రముఖుల నివాళి :** కాగా, డీఎస్ పార్థీవదేహన్ని హైదరాబాద్ లోని ఆయన నివాసానికి తరలించారు.. చివరి చూపు చూసేందుకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు.. వివిధ పార్టీల నేతలు అక్కడి భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు..

### ఢిల్లీ విమానాశ్రయం ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాల కారణంగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కూలిన ఘటనపై ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమర్శించారు. ఈ ఘటనతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు.

శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "విమానాశ్రయ టెర్మినల్ కూలిన ఘటనపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయి. ఇది నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. కూలిన భవనం 15 ఏళ్ల క్రితం అంటే 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన టెర్మినల్ వేరు. ఇలాంటి ఫేక్ న్యూస్‌లు ప్రచారం చేయడం సరికాదు" అని రామ్మోహన్ పేర్కొన్నారు.



పైకప్పు కూలిన ఘటనపై తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నానని ఎక్స్‌లో వెల్లడించారు. టెర్మినల్ వన్ వద్ద ఉన్న ప్రయాణీకులందరికీ సహాయం వెంటనే అందించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఘటనలో ఒకరు చనిపోగా.. మృతుడి కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు.

**ఖర్గే ఏమన్నాయంటే..** విమానాశ్రయ టర్మినల్ కూలిన ఘటనపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మాట్లాడుతూ.. "గత పదేళ్లలో మోదీ పాలనలో దేశంలో జరిగిన నాసిరకం పనులకు తాజాగా జరిగిన ఘటనలు నిదర్శనం. అయోధ్యలో నీటి లీకేజ్, విమానాశ్రయం కూలిపోవడం తదితర సమస్యలన్నీ నాసిరకం పనుల వల్లే జరిగాయి. 2023 - 24లలో డబుల్ ఇంజిన్ సర్కార్ నిర్మించిన 13 కొత్త వంతెనలు కూలిపోయాయి. గుజరాత్‌లో మోర్బీ బ్రిడ్జి కూలింది. అయోధ్యలో కొత్త రోడ్లు అధ్వానంగా మారాయి. ముంబయి ట్రాన్స్ హార్బర్ లింక్ రోడ్డులో పగుళ్లు వచ్చాయి. ఇదంతా మోదీ ప్రభుత్త నిర్లక్ష్యం వల్ల జరిగినవే" అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఉదయం 6 గం.లకే ఫించన్లు పంపిణీ మొదలవ్వాలి

- ఫించన్లు పంపిణీలో నిర్లక్ష్యం జరిగితే కఠిన చర్యలు తప్పవు.
- మొదటి రోజే నూరు శాతం ఫించన్లు పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకోండి.
- ఫించన్లు పంపిణీకి గ్రామ,వార్డు సచివాలయాల తోపాటు ఇతర విభాగాల సిబ్బంది సేవలను వినియోగించుకోండి.
- ఫించన్ మొత్తం తోపాటు సియం లేఖను కూడా ఫించన్ దారులకు అందించాలి.
- చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్.



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ): రాష్ట్రంలో జూలై 1వ తేదీన ఎన్టిఆర్ భరోసా ఫించన్ల పంపిణీని ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఫించన్ల పంపిణీపై శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జులై 1వ తేదీన 65లక్షల 18వేల 496మంది వివిధ ఫించన్ దారులకు గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింట ఫించన్లు పంపిణీకి సంబంధించి 4 వేల 399.89 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఫించన్ల పంపిణీకి ఇతర విభాగాల సిబ్బంది సేవలను కూడా వినియోగించుకునేలా జిల్లా కలెక్టర్లు ఎంపిడిఓ,మున్సిపల్ కమీషనర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు. ఈప్రభుత్వ మొదటి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం కావున ఫించన్లు పంపిణీలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు లేదా నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వకుండా సక్రమంగా పంపిణీ చేయాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. జూలై 1వ తేదీన అన్ని గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో ఉదయం 6గం.లకు మొదటి ఫించన్ పంపిణీ జరగాలని ఆయన ఆదేశించారు. ఫించన్ సొమ్ముతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వ్రాసిన లేఖను కూడా ఫించన్ దారులకు తప్పక అందించాలని సిఎస్ స్పష్టం చేశారు.

జూలై 1వ తేదీన నూరు శాతం ఫించన్లు పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకుని మొదటి రోజే 95 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లకు స్పష్టం చేశారు. అలాగే ఫించన్ల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్లు గంట గంటకూ పర్యవేక్షించాలని ఆదేశించారు. గత ఏప్రిల్,మే,జూన్ మాసాలకు 11 కేటగిరీలలో ఫించన్ దారులకు పెంచిన ఫించన్ మొత్తం బకాయిలను కూడా కలిపి జూలై నెల ఫించన్ 4వేల రూ.లతో కలిపి పంపిణీ చేయాలని సిఎస్ ఆదేశించారు.

ఫించన్లు పంపిణీకి సంబంధించి ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసిన మొత్తాన్ని శనివారం రాత్రిలోగా విత్ డ్రా చేసుకోవాలని సిఎస్ స్పష్టం చేశారు. ఎక్కడైనా ఏ బ్యాంకైనా డబ్బును శనివారం రాత్రికి ఇవ్వలేకుంటే అలాంటి బ్యాంకులు ఆదివారం తెరిచి ఉంచి సంబంధిత ఫించన్ల సొమ్ము మొత్తాన్ని డ్రా చేసి ఇవ్వాలని బ్యాంకులకు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సంబంధిత లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లు(ఎల్డియం)వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ స్పష్టం చేశారు.

ఈసమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ ఫించన్లు పంపిణీకి సంబంధించి ఎన్టిఆర్ భరోసా ఫించన్ పథకం నూతన యాప్ ను పంపడం జరిగిందని దానిని అందరు పింఛన్ పంపిణీ అధికారులు డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పారు. ఫించన్ల పంపిణీకి గ్రామ,వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు అవసరమైన ఇతర విభాగాల సిబ్బందిని కూడా వినియోగించుకోవాలని చెప్పారు.

ఈవీడియో సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ యం. శివ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి. సత్య నారాయణ,వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరికి అండగా ... ప్రజా ప్రభుత్వం



(మొదటి పేజీ తరువాయి)

ముఖాముఖిలో సీఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. సీఎం గ్రామస్థులతో మాట్లాడే ప్రాంతానికి ప్రజావేదికగా నామకరణం చేశారు. ప్రజల సమస్యలు వినే ప్రజావేదికను మాజీ సీఎం జగన్ కూల్చేసిన విషయం తెలిసిందే. పెనుమాక గ్రామంలో ప్రజలతో మాట్లాడే ప్రాంతానికి ప్రజావేదికగా సీఎం చంద్రబాబు నాయుడు నామకరణం చేయనున్నారు.

కాగా.. ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను జూలై ఒకటో తేదీనే పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. ప్రతి ఉద్యోగి 50 పింఛన్లు పంచేలా సర్దుబాటు చేయాలని ఆదేశించారు. ఇందుకు క్లస్టర్ విధానం అనుసరించాలన్నారు. ప్రతి క్లస్టర్‌కు సిబ్బందిని పక్కాగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఇవ్వరాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## తిరుమల ఈడీపీ ఆఫీస్‌లో మంటలు..

(మొదటి పేజీ తరువాయి)

సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే తిరుమల ప్రక్షాళనకు చంద్రబాబు నడుం బిగించారు. టీటీడీ ఈవోగా జె శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రతి నిత్యం ఏదో ఒక డిపార్ట్‌మెంటుతో సమావేశమవుతూ ఆ విభాగంలో లోటు పాట్లను తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. ఎప్పటికప్పుడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు తమ విభాగ పరిస్థితిని ఈవోకు వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే విజిలెన్స్ అధికారులను సైతం శ్యామలరావు అప్రమత్తం చేశారు. దీంతో తిరుమలలోని అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారులు ఫోకస్ పెట్టారు. ఇప్పుడు సడెన్‌గా ఈడీపీ కార్యాలయంలో మంటలు చెలరేగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కన్నుమూత



తేదిలాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) : ఆదిలాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాథోడ్ రమేష్ శనివారం కన్నుమూశారు. ఇవాళ ఉదయం ఉట్నూరులోని తన నివాస గృహంలో రక్తపోటు నిల్వలు పడిపోయి స్పృహ తప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే వైద్య చికిత్సల నిమిత్తం ఆదిలాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కు తరలించారు. మధ్యాహ్నం 12:30గంటలకు మార్గమధ్యంలోనే కోమాకు వెళ్లి చివరి శ్వాస విడిచారు. రమేష్ రాథోడ్ కొంతకాలంగా అధిక రక్తపోటు, కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ ఢిల్లీలో ఇటీవలే చికిత్స పొంది వచ్చారు.

**తిరుగులేని నేతగా ఎదిగిన రాథోడ్**

షెడ్యూల్ తెగలకు చెందిన రమేష్‌రాథోడ్, అట్టడుగు స్థాయి నుంచి రాజకీయ నాయకుడుగా ఎదుగుతూ వచ్చారు. ఆయనకు సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉంది. అతను 1999లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా శాసనసభకు ఎన్నికయ్యారు. 2006-2009 మధ్య కాలంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2009లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అదే సమయంలో ఆయన భార్య సుమన్ రాథోడ్ ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మరోసారి ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. జూన్ 2021లో ఈటెల రాజేందర్తోపాటు బీజేపీలో చేరారు. ఆయనకు ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తో సహా పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు.

**రేవంత్ సంతాపం..** ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ ఆకస్మిక మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఆయన ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. ఈ సందర్భంగా రమేశ్ రాథోడ్‌తో ఉన్న అనుబంధాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## వైసీపీ కార్యాలయం కూల్చివేత.... ఉద్రిక్తత




**తూర్పుగోదావరి , కడియం ( జర్నలిస్ట్ ఫైల్ )**: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ కట్టాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్మిషన్ లేకుండా నిర్మించిన కట్టడాలపై ఉక్కుపాదం మోపింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాన్ని కూల్చివేసింది. అంతేకాదు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణాలపైనా ఆరా తీసింది. దీంతో షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి. ఏ ఒక్క వైసీపీ కార్యాలయానికి కూడా అనుమతులు లేనట్టుగా తేలింది. దీంతో అన్ని కార్యాలయాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఇదిలా ఉంటే శనివారం మధ్యాహ్నం తూర్పుగోదావరి జిల్లా కడియంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కడియంలో అక్రమంగా నిర్వహించిన వైసీపీ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు జేసీబీలతో వైసీపీ కార్యాలయాన్ని నేలమట్టం చేశారు. అయితే ఈ కూల్చివేతను అడ్డుకునేందుకు వైసీపీ నేత గిరిజాల బాబు ప్రయత్నంచేశారు. రైతు బజార్ నిర్మాణానికి సంబంధించి షెడ్డు నిర్మించామని తెలిపారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో వైసీపీ నేత గిరిజాలబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కడియం పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో ఆయన అనుచరులు ఆందోళనకు దిగారు. గిరిజాలబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ నేతలపై కక్ష సాధింపులకు దిగిందని, తమ కార్యాలయాలను ఉద్దేశపూర్వకంగానే కూల్చివేస్తోందని ఆరోపించారు

## నేను ఎప్పటికి ప్రజల మనిషినే: ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** తాను ఎప్పుడూ అందరి మనిషినని.. ప్రజల మనిషినని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) తెలిపారు. టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, నాగుల్ మీరా ప్రోత్సాహంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కేశినేని నాని ఆనాడు చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. సీఎం చంద్రబాబుకు తాను మొదటి నుంచీ అభిమానినని.. ఆయన సారధ్యంలో పని చేసే అవకాశం తనకు వచ్చిందని కేశినేని చిన్ని తెలిపారు. మీ అందరి కష్టం వల్లే తాను ఎంపీగా గెలిచానన్నారు. ఇంత భారీ విజయంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. శక్తి వంచన లేకుండా అభివృద్ధి కోసం పని చేస్తానని కేశినేని చిన్ని తెలిపారు.

ఉడతా భక్తిగా తన వంతు సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. బుద్ధా వెంకన్న, తన లాంటి వాళ్లు మనసులో ఒకటి పెట్టుకుని పైకి వేరేది మాట్లాడబోమని కేశినేని చిన్ని తెలిపారు. మాకు ఏదనిపిస్తే అదే ఓపెన్‌గా చెబుతామన్నారు. టీడీపీ కోసం పని చేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అధిష్టానం మన కృషికి తగిన విధంగా గౌరవిస్తుందని తెలిపారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరం కలిసి పని చేద్దామన్నారు. గత నాయకుడి ఒంటెత్తు పోకడలు మరచిపోవాలని సూచించారు. ఇక నుంచి మనమంతా ఒకటని.. తనకు అండగా నిలిచిన ప్రజలను ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటానని కేశినేని చిన్ని అన్నారు.

బుద్దా వెంకన్న ఆయన సీటు కన్నా.. తన సీటు కోసం చాలా కష్టపడ్డారని కేశినేని చిన్ని తెలిపారు. నాగుల్ మీరా కూడా తన కోసం పని చేశారన్నారు. మీరు ఇచ్చిన సహకారం, మీరు పడిన కష్టం ఎప్పుడూ మరువబోనని తెలిపారు. కూటమి పొత్తు వల్ల సీనియర్ నాయకులకు అన్యాయం జరిగిందని.. కానీ భవిష్యత్తు లో అందరికీ న్యాయం చేసేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు నుంచి నాయకుల వరకూ తనతో నడిచిన వారందరినీ గుర్తు పెట్టుకుంటానని తెలిపారు. మనందరం టీడీపీ అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు.

## అధికారం మారింది కానీ టీటీడీ అధికారుల పని తీరు మారలే..



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** అధికారం మారింది కానీ తిరుమలలోని చాలా మంది టీటీడీ అధికారులు ఇంకా గత ప్రభుత్వంలో ఉన్నట్టే పని చేస్తున్నారని.. వారినందరినీ తిరుమల నుంచి సాగనంపాలని శ్రీనివాసానంద స్వామి కోరారు. తిరుమలలో అక్రమంగా నిర్మించిన విశాఖ శారద పీఠాన్ని వెంటనే సీజ్ చేయాలన్నారు. ఆ భారీ భవన నిర్మాణం బలహీనంగా ఉందని... అది కూలిపోయి, జరగరానిది జరిగే ప్రమాదం ఉంది కాబట్టి ఆ భారీ కట్టడాన్ని తొలగించాలని శ్రీనివాసానంద స్వామి కోరారు. తిరుమలలోని చాలా మఠాల్లో ధార్మిక కార్యక్రమాలు జరగటం లేదని.. పెళ్లి, గదులు, అన్నదానం వంటివన్నీ వ్యాపారంగా మారాయన్నారు.

విలాసవంతమైన ఫైవ్ స్టార్ హోటళ్లను తలపించేలా జగన్ హయంలో తిరుమలలో కొత్తగా నిర్మాణాలు జరిగాయన్నారు. వీటిపైన ప్రస్తుత ప్రభుత్వం విచారణ జరిపించాలని శ్రీనివాసానంద స్వామి కోరారు. తిరుమల పవిత్రత కోసం ఆమరణ దీక్ష చేయటానికైనా సిద్ధమన్నారు. రాఘవేంద్ర , రవీంద్ర బాబు, రామారావు అనే వ్యక్తులు అనేక మఠాలు వారి చేతుల్లో పెట్టుకున్నారన్నారు. ఒక్కో గది రెండు, మూడు వేల రూపాయలని.. ఆ గదుల ఆదాయం వేంకటేశ్వరస్వామికి రావాలి కానీ ప్రైవేటు వ్యక్తులు, మధ్యవర్తుల చేతులకు పోతోందన్నారు. ఎంత మంది పీఠాపతులు కనీసం వారం రోజులైనా తిరుమలలో ఉన్నారా? అని ప్రశ్నించారు.

కొన్ని మఠాల పీఠాధిపతులు కనీసం ఒక్క రోజు కూడా రావటం లేదని శ్రీనివాసానంద స్వామి అన్నారు. దీనిపై టీటీడీ, ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మఠాల్లో వారి శిష్య పరంపర లేదని.. ప్రైవేటు వ్యక్తులకు లీజుకు, సబ్ లీజుకు, సెమీ లీజుకు ఇస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం చంటి పిల్లలకు కూడా పాలు ఇవ్వకుండా, భక్తులకు నరకాన్ని చూపించిందన్నారు. గత ప్రభుత్వంలో ఈవో డౌన్ డౌన్, ఛైర్మన్ డౌన్ డౌన్ అని నినాదాలు చేశారన్నారు. విశాఖ శారదపీఠం చేసిన భూదందాలు, రాజకీయ పైరవీలపై విచారణ జరగాలని శ్రీనివాసానంద స్వామి కోరారు.

## రివర్స్ టెండరింగ్ కారణంగా తీవ్రమైన నష్టం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయడం వల్ల వాస్తవాలు బహిర్గతం అయ్యాయని బీజేపీ ప్రత్యేక అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్ట్ 2019కి ముందు మొత్తం 72% పూర్తైందని తెలిపారు. ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు 14,418.39 కోట్ల రూపాయలు అని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక చేసిన ఆరోపణలకు సాక్ష్యాలు చూపలేదని లంకా దినకర్ అన్నారు. పనులు కూడా రివర్స్ టెండరింగ్ పేరుతో నిలిపేశారని అన్నారు. ప్రాజెక్టు వ్యయం తగ్గకపోగా దాదాపు మరో 33% పెరిగిందని లంకా దినకర్ పేర్కొన్నారు. “రివర్స్ టెండరింగ్” మంత్రం కారణంగా తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్ట్ పురోగతిలో తప్పుడు పాలన, అవినీతి కారణంగా వ్యయం పెరిగిపోయిందని పేర్కొన్నారు.

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా 2019 లో ప్రమాణం చేసే నాటికి పోలవరం నిర్మాణం పనులు 70 % పైగా జరిగాయన్నారు. గడిచిన 5 సంవత్సరాలలో కనీసం 10 % పనులు కూడా పూర్తి కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న 960 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ అస్మదీయుల ద్వారా కొట్టేయడానికి ఉన్న శ్రద్ధ, ప్రాజెక్టు పైన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్టలేదని లంకా దినకర్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడం వల్ల డయాఫ్రమ్ వాల్, రివిట్మెంట్, ఎర్త్ కామ్ రాక్ ఫీల్ డ్యామ్ దెబ్బతిని మూడు వేల కోట్లకు పైగా నిధులు వృథా అయ్యాయన్నారు. జగన్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అసలు పట్టించుకోలేదన్నారు. రాబోయే 4 సంవత్సరాలలో ఎన్డీఏ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర సహకారంతో పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని లంకా దినకర్ పేర్కొన్నారు.

## వలంటీర్లు ఇచ్చిన డేటాతో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేం

### వారు చేసిన సర్వేకు ప్రామాణికత లేదు.. వీఆర్‌వోల ఆందోళన

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన కులగణన ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాల జారీ చేపట్టాలంటూ సీసీఎల్ఏ తాజాగా ఇచ్చిన ఆదేశాలపై వీఆర్‌వోలు భగ్గుమంటున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు టార్గెట్లు నిర్ణయించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ దృష్టికి తీసుకు వెళ్లాలని ఏపీ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కులగణన చేయించారు. అయితే ఇది సమగ్రంగా జరగలేదు. ఈ క్రమంలో ఎస్సీలను ఓసీలుగా.. ఓసీలను ఎస్సీలుగా నమోదు చేసిన ఉదంతాలు అనేకం ఉన్నాయని వీఆర్‌వోలు ఆరోపిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలైన వలంటీర్లు ఇచ్చిన డేటాను పట్టుకుని ప్రస్తుతం రెవెన్యూ ఉన్నతాధికారులు.. రోజుకు 100 నుంచి 200 వరకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. వీఆర్‌వోల ఆందోళనల నేపథ్యంలో.. విజయవాడలోని ఏపీవీఆర్‌వో సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అగ్రనాయకులు కోన ఆంజనేయకుమార్, జి.అనుపమ వీర్‌వోల సంఘ ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ అంశాన్ని రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ దృష్టికి కూడా తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

## పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి : టీజీ భరత్



**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్ ):** కర్నూలు నగరంలోని వీధుల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో పాటు కర్నూలు సమీపంలోని జగన్నాథం కట్టపై ఉన్న టిడ్కో ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టిజి భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం టిడ్కో, శానిటేషన్ సంబంధిత అధికారులతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోని వీధుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో శానిటేషన్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్త సేకరణపై చర్చించారు.

ప్రతి రోజూ క్రమం తప్పకుండా కాల్వలు శుభ్రం చేయాలన్నారు. తమ ఫ్యాక్టరీ నుండి ఉచితంగా అందజేస్తున్న హైపో ద్రావణాన్ని తీసుకొని వీధుల్లో పిచికారీ చేయాలని ఆదేశించారు. ఏ రోజు ఎక్కడెక్కడ హైపో ద్రావణం పిచికారీ చేస్తున్నారో రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు సక్రమంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య విభాగంలో సరైన సిబ్బంది లేకపోవడం, ఆర్థిక వనరుల కొరత ఉందన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతానని, అవసరం అయితే మున్సిపల్ శాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి టి.జి భరత్ తెలిపారు.

కర్నూలు నగర సమీపంలోని జగన్నాథ గట్టుపై 10 వేల టిడ్కో గృహాలు మంజూరైనాయని ఈ గృహాల కొరకు అర్హులైన వారి వివరాలను వార్డువైజుగా లిస్ట్ తయారు చేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గృహాలు పూర్తికావడానికి ఇంకా ఎంత నిధులు అవసరమని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

త్వరితగతిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలు గృహాల్లో నివసించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, మున్సిపల్ ఎంహెచ్‌వో విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి విడదల రజిని, ఆమె పీఏపై పోలీసులకు ఫిర్యాదు

**చిలకలూరిపేట (జర్నలిస్ట్ ఫైల్):** 164 స్థానాలను కైవసం చేసుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కాగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై నూతన ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ పాలనలో అన్యాయానికి గురైన ప్రజలు సైతం ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. దీనితో అధికారం ముసుగులో వైసీపీ నేతలు చేసిన అక్రమాల గుట్టు రట్టవుతోంది.

తాజాగా పల్నాడు జిల్లాలో మాజీ వైసీపీ మంత్రి విడతల రజిని పీఏపై పోలీసులకు ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే..పల్నాడు జిల్లాలోని యడ్లపాడు మండలానికి చెందిన స్టోన్ క్రషర్ వ్యాపారులను 2020వ సంవత్సరంలో రజిని పీఏ రామకృష్ణ రూ. 5 కోట్ల లంచం కోసం బెదిరించారని ఆరోపించారు. అయితే అంత కట్టలేమని వ్యాపారులు బతిమాలితే చివరికి రూ. 2.20 కోట్లకు రజిని మరిది గోపి డీల్ సెట్ చేశారని అన్నారు.

పీఏ రామకృష్ణ దందాకు అప్పటి విజిలెన్స్ ఎస్పీ జాషువా సహకరించారని ఆవేదన వ్యక్తం చేసిన బాధితులు.. మాజీ వైసీపీ మంత్రి విడతల రజిని పీఏపై పల్నాడు అడిషినల్ ఎస్పీ లక్ష్మీపతికి ఫిర్యాదు చేశారు.



# తెలంగాణా వార్తలు

## కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు పొడిగింపు

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ): :** కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును తెలంగాణ ప్రభుత్వం పెంచింది. రెండు నెలల పాటు గడువును పెంచుతూ ఇరిగేషన్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీ చేశారు. రేపటితో గడువు ముగియడంతో ఆగస్టు 31వ తేదీ వరకు కాళేశ్వరం కమిషన్ గడువును పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.




## టెక్స్‌టైల్స్ పనులు వేగవంతం: సీఎం రేవంత్

**వరంగల్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి, సాయంపేట ఊకలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్కును సందర్శించారు. టెక్స్ టైల్స్ పార్కుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని ఆదేశించారు. భూ నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. 1200 నుంచి 1400 వరకు భూ నిర్వాసితులు ఉన్నారని, నిర్వాసిత పునరవాస ప్రాంతాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ పంచాయతీలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

**సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం..**

వరంగల్ పర్యటనకు వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. చింతలపల్లి, సాయంపేట ఊకలులో



ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇక్కడకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యే లు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

**వనమహోత్సవం :** టెక్స్‌టైల్స్ పార్కులోని ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఆయనతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, సీతక్క, కోమటి రెడ్డి వెంకట రెడ్డి తదితరులు కూడా మొక్కలు నాటారు. అనంతరం మరికొన్ని టెక్స్‌టైల్స్ పార్కులను సీఎం సందర్శించారు.

అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. వరంగల్ సెంట్రల్ జైల్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న 24 అంతస్థుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించిన పవన్ కళ్యాణ్



**కొండగట్టు ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ సుప్రసిద్ధ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఇవాళ జగిత్యాల జిల్లా కొండగట్టులోని ఆంజనేయ స్వామిని దర్శించుకుని పవన్ కళ్యాణ్ మొక్కులు చెల్లించారు.

ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో కొండగట్టుకు తొలిసారి వచ్చిన పవన్ కళ్యాణ్ కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంజన్న దర్శనం అనంతరం పవన్ కళ్యాణ్ కు స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# డి ఎస్ మృతిపై పలువురు ప్రముఖ నేతల సంతాపం







**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ ఈరోజు(శనివారం) తెల్లవారు జామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. అయితే కాంగ్రెస్ సంప్రదాయం ప్రకారం పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ పార్థీవదేహంపై పార్టీ కండువా, జెండా కప్పి కాంగ్రెస్ నేతలు గౌరవించారు.

డీఎస్ పార్థివ దేహంపై కాంగ్రెస్ కండువా కప్పగానే డీఎస్ చివరి కోరిక తీరిందని ఆయన స్నేహితులు చెబుతున్నారు. డీఎస్‌కు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ నివాళి అర్పించారు. డీఎస్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. డీఎస్ కుమారులు సంజయ్, అరవింద్‌లను పరామర్శించారు.

**రాజారామ్ శిష్యుడిగా...** డి. శ్రీనివాస్ మరణం కాంగ్రెస్ పార్టీకి, బలహీన వర్గాలకు తీరని లోటని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగారని గుర్తుచేసుకున్నారు. ఆ నాటి కాంగ్రెస్ పెద్దలు రాజారామ్ శిష్యుడిగా ఉమ్మడి రాష్ట్రానికి శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షులుగా ఎదిగారని చెప్పారు.

**రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా ..** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా సారథ్యం వహించిన శ్రీనివాస్ కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. డీఎస్ ఆకాల మరణం తమకు తీరని లోటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున, కాంగ్రెస్ పక్షాన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని మల్లు భట్టి విక్రమార్క వ్యక్తం చేశారు.

**ధర్మపురి శ్రీనివాస్ మృతి కి రేవంత్ సంతాపం**

మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షునిగా పని చేసిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి ఆయన విశిష్ట సేవలను అందించారని అభిప్రాయపడ్డారు.

సామాన్య స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన డీఎస్ రాజకీయ నేతలెందరికో ఆదర్శంగా నిలిచారని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలోనూ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆయన తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని గుర్తు చేసుకున్నారు. డీ శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్ సీనియర్ నేత డి.శ్రీనివాస్ మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజాసేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు. 2004-2009 వరకు అసెంబ్లీలో డీఎస్ ప్రోత్సాహం మరువలేనిదన్నారు. డి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బంజారా హిల్స్ లోని డిఎస్ స్వగృహానికి వెళ్లిన కిషన్ రెడ్డి డిఎస్ పార్థీవ దేహంపై పుష్ప గుచ్చాలు ఉంచి నివాళులర్పించారు.

**బండి సంజయ్ :** గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ మంత్రి, పీసీసీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ మరణం బాధాకరం. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా, రెండు సార్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా డీఎస్ అందించిన సేవలు ఎనలేనివి. బ్యాంకు ఉద్యోగిగా జీవితాన్ని ఆరంభించిన డీఎస్ రాజకీయాల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగి రెండుసార్లు పీసీసీ అధ్యక్షులుగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యులుగా సేవలందించారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో డి.శ్రీనివాస్ పాత్ర మరువలేనిది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు హామీని 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చడంతోపాటు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పార్టీ అధిష్టానాన్ని ఒప్పించడంలో డీఎస్ చేసిన క్రుషి మరువలేనిది. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం డి.శ్రీనివాస్ నిరంతరం పాటుపడేవారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు. డీఎస్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా అంటూ బండి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**విహెచ్ సంతాపం :** డి.శ్రీనివాస్ భౌతికగాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు.. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు..

**కెసిఆర్ సంతాపం :** మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**కెటిఆర్ సంతాపం :** మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి. శ్రీనివాస్ భౌతికకాయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కూడా నివాళులర్పించారు.

**ఉత్తమ్ కుమార్ రెడ్డిసంతాపం:** మాజీ పీసీసీ అధ్యక్షులు డి. శ్రీనివాస్ అకాల మరణం పట్ల రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి, మాజీ టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. డీఎస్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ :** బంజారాహిల్స్ లోని వారి నివాసంలో మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు :** శ్రీనివాస్ మృతి పట్ల మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఏపీ పిసిసి అధ్యక్షుడిగా వారు చేసిన సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. డీ.ఎస్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు .

**హరీశ్ రావు :** డీఎస్ మృతి పట్ల మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు నివాళి అర్పించారు. మంత్రిగా, ఎంపీగా డీఎస్ సుదీర్ఘకాలం సేవలందించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**తలసాని శ్రీనివాస్ యాదవ్:** శ్రీనివాస్ మృతికి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. క్రిందిస్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నతస్థాయి కి చేరుకున్నారని, ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు.. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

**సంతాపం ప్రకటించిన మధుయాష్కి గౌడ్:** కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షులు డి. శ్రీనివాస్ మృతి పట్ల టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి డి శ్రీనివాస్ విశేష కృషి చేశారని, కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన సమర్థవంతంగా పనిచేశారన్నారు.

**మహేష్ కుమార్ గౌడ్‌సంతాపం.. :** మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి, డీఎస్ రాజకీయాలలో అపార అనుభవం ఉన్న నేత అని, బడుగు బలహీన వర్గాలు కోసం ఆయన ఎంతో శ్రమించారని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. డీఎస్ తో నాకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

**వి ప్రశాంత్ రెడ్డిసంతాపం :** వేల్పూర్ గ్రామ వాసి డి. శ్రీనివాస్ గారి మరణం నాకు వ్యక్తి గతంగా బాధను కలిగించింది. సామాన్య కార్యకర్త నుండి పీసీసీ అధ్యక్షుడి వరకు ఆయన అంచెలంచెలుగా ఎదిగిన తీరు నేటి రాజకీయాలకు ఆదర్శం. నా సొంత గ్రామమైన వేల్పూర్ వాస్తవ్యులైన డి.శ్రీనివాస్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాజకీయ పార్టీలు వేరైనా మా తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి గారికి సన్నిహితులుగా ఉండేవారు. వారి మరణం నిజామాబాద్ జిల్లా ప్రజలకు,రాజకీయాలకు తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని, డి.శ్రీనివాస్ గారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను.

## అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**శ్రీనగర్ :** అమర్‌నాథ్ యాత్ర శనివారం ప్రారంభమైంది. శ్రీనగర్‌లోని హిమాలయాల్లో ఉన్న ఆలయ దర్శనం కోసం బాల్టాల్, నునావన్ క్యాంపుల మొదటి బ్యాచ్ యాత్రికులు బయలుదేరారు. ఈసారి ఈ యాత్ర నెలన్నర పాటు కొనసాగనుంది. ఆగస్టు 19న అమర్నాథ్ యాత్ర ముగుస్తుంది. ఈ మేరకు అధికారులు ప్రజలకు సమాచారం అందించారు. నువాన్-పహల్గామ్ రూట్లో 48 కిలోమీటర్లు, బల్తాల్ రూట్లో 14 కిలోమీటర్ల మార్గంలో ప్రజలు వెళుతున్నారు. ఈ రెండూ అమర్‌నాథ్ యాత్రకు మార్గాలు. ఈ రెండు మార్గాల్లో యాత్రికుల బృందాలను సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, పోలీసు పరిపాలనలోని సీనియర్ అధికారులు పంపినట్లు అధికారులు తెలిపారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శుక్రవారం ఉదయం జమ్మూలోని భగవతి నగర్‌లోని యాత్రి బేసిక్ క్యాంప్ నుండి 4,603 మంది యాత్రికులను జెండా ఊపి పంపించారు. ప్రభుత్వ అధికారులు జెండా ఊపి యాత్రికులకు గుడ్‌లక్ చెప్పారు. ఈ క్రమంలో.. యాత్రికులు మధ్యాహ్నం కాశ్మీర్ లోయకు చేరుకోగా అక్కడ వారికి స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. యాత్ర సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు.. ఇతర పారామిలటరీ బలగాలకు చెందిన వేలాది మంది భద్రతా సిబ్బంది భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు.

## కేజ్రీకి మరో షాక్..

**ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు 3 రోజుల సీబీఐ కస్టడీ శనివారం పూర్తయింది. కస్టడీ ముగియడంతో సీబీఐ అధికారులు.. కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరు పరిచారు. విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు కేజ్రీకి మరో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తీర్పు వెలువరించింది. జులై 12 వరకు ఆయన రిమాండ్‌లో ఉండనున్నారు. కోర్టు తీర్పుతో కేజ్రీకి, ఆమ్ ఆద్మీ పార్టీకి షాక్ తగిలినట్టైంది. కేజ్రీవాల్‌ని మరి కాసేపట్లో తీహార్ జైలుకు తరలించనున్నారు.


**ఆప్ నిరసనలు..** అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా శనివారం ఢిల్లీలోని దిన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ఎదుట ఆప్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

ఆ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగానినాదాలు చేశాయి. కేంద్ర ప్రభుత్వసంస్థల దుర్వినియోగం, నియంత పాలన అంతం.. కోసం అంటూ పార్టీ శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శించాయి. మరోవైపు బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద అనుమతి లేదంటూ ఆప్‌కి చెందిన ఆందోళనకారులను పోలీసులు నిలిపివేసే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.



## ఇందిరాగాంధీ ప్రతిపక్షాలను గౌరవించేవారు

**పాట్నా :** భారతదేశ మాజీ ప్రధాని ఇందిరిగాంధీ 1975లో విధించిన ఎమర్జెన్సీ 'ప్రజాస్వామ్యానికి నల్లని మచ్చ' అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ధ్వజమెత్తారు. 'ఇంకెన్నాళుఎమర్జెన్సీ గురించి మాట్లాడతారు' అంటూ ఖర్గే మండిపడ్డారు. తాజాగా కాంగ్రెస్ పాలనలో విధించిన ఎమర్జెన్సీ గురించి.. బిజెపి ప్రచారం చేయడంపై ఆర్‌జెడి నేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ స్పందించారు. 'ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా మేము పోరాడినా.. ఇందిరాగాంధీ జైల్లో పెట్టించారు. కానీ ఆమె ఎప్పుడూ మమ్మల్ని దుర్భాలాషలాడలేదు. ప్రతిపక్షాలను గౌరవించేవారు' అని లాలూ ప్రసాద్‌యాదవ్ అన్నారు. ఆయన ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పుడు ఎమర్జెన్సీ గురించి విమర్శిస్తున్న బిజెపి, సంఘపరివార్‌లు ఆ సమయంలో సైలెంట్‌గా ఉన్నాయని లాలూ విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో సంఘపరివార్ సైలెంట్‌గా ఉందని నళిన్ వర్మ అనే జర్నలిస్టు రాసిన కథనాన్ని కూడా



లాలూ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈకథనాన్ని కూడా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

'అప్పటి ప్రధాని ఇందిరిగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జయప్రకాశ్ నారాయణ్ ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీకి నేను కన్వీనర్‌గా ఉన్నాను. అప్పుడు నేను 15 నెలలకు పైగా భద్రతా చట్టం (ఎంఐఎస్ఎ) కింద జైలులో ఉన్నాను. ఈరోజు ఎమర్జెన్సీ గురించి చాలామంది బిజెపి మంత్రులు మాట్లాడుతున్నారు. ఎమర్జెన్సీలో జైళ్లకు వెళ్లిన నాకు కానీ, నా సహచరులకు కానీ వీళ్లగురించి తెలియదు. మోడీ, జెపి నడ్డా, మోడీ మంత్రివర్గ సహచరుల గురించి మేము వినలేదు. ఈరోజు మాకు వీరంతా స్వేచ్ఛ, దాని విలువ గురించి ఉపన్యాసాలు ఇస్తున్నారు.' అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ఇందిరాగాంధీ మనలో చాలామందిని కటకటాల వెనక్కి నెట్టారు. కానీ ఆమె మమ్మల్ని ఎప్పుడూ దుర్భాలాషలాడలేదు. ఆమె కానీ, ఆమె మంత్రులు కానీ మమ్మల్ని 'జాతీయ వ్యతిరేకులు' లేదా 'దేశభక్తి లేనివారు' అని పిలవలేదు. మన రాజ్యాంగాన్ని రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతిని అపవిత్రం చేయడానికి ఆమె విధ్వంసకారులను అనుమతించలేదు. 1975 ఎమర్జెన్సీ మన ప్రజాస్వామ్యానికి మచ్చే. కానీ అప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రతిపక్షాలను సైతం గౌరవించేవారు. అదే ఇప్పుడయితే 2024లో మోడీ కానీ, ఆయన మంత్రివర్గ సహచరులు ఎవరూ కూడా ప్రతిపక్షాలను గౌరవించడం లేదనేది మరిచిపోకూడదు.' అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీపై.. గవర్నర్ పరువు నష్టం దావా

**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై.. ఆ రాష్ట్ర గవర్నర్ సివి ఆనంద్ బోస్ పరువు నష్టం దావా వేశారు. మమతా ఇటీవల మహిళలు రాజ్‌భవన్‌లోకి వెళ్లేందుకు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకుగానూ ఆమెపై గవర్నర్ సివి ఆనంద్ శుక్రవారం కలకత్తా హైకోర్టులో కేసు నమోదుచేసినట్లు తెలుస్తోంది. కాగా, మే నెల మొదటివారంలో రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగిని గవర్నర్ ఆనంద్ తనను లైంగిక వేధించారంటూ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై మమతా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనపై కుట్ర పన్నారని, అందులో భాగంగానే ఈ ఆరోపణలొచ్చాయని గవర్నర్ కొట్టిపారేశారు. అయితే బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో.. తాజాగా మమతా




సచివాలయంలో జరిగిన పాలక భేటీలో రాజ్‌భవన్‌కు వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారని, తనకు ఫిర్యాదులు చేస్తున్నారని' ఆమె వ్యాఖ్యానించారు. మమతానే కాదు.. కొందరు టిఎంసి నేతలు కూడా గవర్నర్‌పై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. దీంతో మమతాబెనర్జీతోపాటు, టిఎంసి నేతలపైనా గవర్నర్ పరువు నష్టం దావా వేసినట్లు తెలుస్తోంది. గవర్నర్ చర్యలకి బిజెపి మద్దతు తెలిపింది. మరోవైపు సిపిఐ(ఎం) నేత సుజాన్ చక్రవర్తి రాష్ట్రంలో జరుగుతున్న ఈ పరిణామాలతో ఎలాంటి ప్రయోజనం ఒనగూరదని, పైగా జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని అన్నారు.

# జాతీయ వార్తలు

## బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వండి

**బిహార్:** ఏపీలో అత్యధిక ఎంపీ సీట్లు సాధించిన టీడీపీ, ఇటు బిహార్‌లో గణనీయ సంఖ్యలో ఎంపీ స్థానాలు గెలుచుకున్న జేడీయూ సాయంతో మూడోసారి ఎన్డీయే పగ్గాలు చేపట్టింది. దీంతో ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రధాని మోదీ ముందు పెద్ద కోరికలే కోరే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు జరిగాయి. వీటిని నిజం చేస్తూ నితీశ్ కుమార్.. మోదీ ముందు భారీ డిమాండ్ ఉంచారు.

అదే ప్రత్యేక హోదా. ఏపీలాగే ఎన్నో ఏళ్ల నుంచి బిహార్ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రత్యేక హోదా అడుగుతోంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో తాము కీలకంగా ఉన్నామని భావిస్తున్న జేడీయూ ఇదే అదనుగా భావిస్తూ ప్రత్యేక హోదా అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తోంది. బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) డిమాండ్ చేసింది. హోదా లేకుంటే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరింది.

ఎన్డీయేలో భాగస్వామ్యంగా ఉన్న ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. తీర్మానంలో రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధిలో వెనుకబడి ఉండటాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరమని, దీర్ఘకాలంగా ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతోపాటు ఈ మధ్యే రిజర్వేషన్లను 65 శాతానికి పెంచిన కోటాను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

న్యాయ పరిశీలన, రక్షణ కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ కోటాను చేర్చాలని జేడీయూ ప్రతిపాదించింది. అలాగే ఈ కోటాను నిరంతరాయంగా అమలు చేస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. ఇదే సమావేశంలో ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం సంజయ్ ఝాను నియమించారు.

నితీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కోర్ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో రెండు ముఖ్యమైన ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. అవి ఒకటి సంజయ్ ఝా నియామకం. రెండు జేడీయూ.. ఎన్డీయే కూటమిలోనే కొనసాగడం. ఈ నిర్ణయాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.




# రాజీనామా చేసినా వీసీని వదిలిపెట్టం

## ఎంపీ సీఎం రమేశ్ , ఎమ్మెల్యేలు వెలగపూడి, గంటా , వంశీకృష్ణ యాదవ్



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రా యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారని మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు. వీసీ ప్రసాదరెడ్డి రాజీనామా చేసినా ఏయూలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ అక్రమాలపై గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రాజీనామా చేసినప్పటికీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌సన్ రాజీనామాల నేపథ్యంలో పూర్వ విద్యార్థులు వర్సిటీకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.

ఈ క్రమంలోనే ఎంపీ సీఎం రమేశ్‌తో పాటు ఎమ్మెల్యేలు విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ దక్షణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ తదితరులు వర్సిటీకి చేరుకుని పరిశీలించారు. వర్సిటీకి వచ్చిన నేతలకు ఏయూ విద్యార్థులు, పరిశోధకులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఆంధ్రా యూనివర్సిటీ నుంచే వైసీపీ కార్యకలాపాలు నడిచాయని ఆరోపించారు. ఏయూ వైసీపీ కార్యాలయంగా మారిందని విమర్శించారు. ఇక్కడ జరిగిన అవకతవకలపై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరుపుతామని తెలిపారు. వర్సిటీలోని వైఎస్ విగ్రహం తొలగించడం తమకు పెద్ద పనేమీ కాదని పేర్కొన్నారు. అయితే ఉద్యోగ, విద్యార్థి సంఘాల అభిప్రాయం మేరకే దానిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏయూ ప్రతిష్ఠను మాజీ వీసీ ప్రసాదరెడ్డి దెబ్బతీశారని మండిపడ్డారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఆంధ్రా యూనివర్సిటీలో అనేక అక్రమాలు జరిగాయని విమర్శించారు. వర్సిటీలో వైఎస్ విగ్రహం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు పెట్టారని, నియామకాలు చేశారని ఆరోపించారు. అడ్డగోలుగా పదవులు పొందిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. ఏయూలో మళ్లీ పూర్వ పరిస్థితులు రప్పిస్తామన్నారు. యూనివర్సిటీలో రాజకీయాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా రాజకీయాలు చేస్తామన్నా చంద్రబాబు ఊరుకోరని అన్నారు.

## డిఎస్ మరణం బాధాకరం



**అమరావతి:( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి.శ్రీనివాస్ మృతికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయడు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉన్న డి.శ్రీనివాస్ మంత్రిగా, ఎంపిగా తనదైన ముద్ర వేశారని వారు అన్నారు. ఆయన మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. శ్రీనివాస్ ఎప్పుడూ హుందాగా రాజకీయాలు చేసే వారని....తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారని అన్నారు. డి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ఏపీ వైద్య ఆరోగ్య శాఖకు నాలుగు యన్ క్యూఏయస్ అవార్డులు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ నాలుగు జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల అవార్డుల్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని నాలుగు ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు ఈ జాతీయ స్థాయి పురస్కారాల కోసం ఎంపికయ్యాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి జె.పి. నడ్డా చేతుల మీదుగా ఈ అవార్డుల్ని అందుకోవడం పట్ల ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ మరియు యన్ హెచ్ యం యం.డి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారుల్ని శనివారం అభినందించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్టేట్ నోడలాఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, క్వాలిటీ అష్యూరెన్స్ పీవో డాక్టర్ రమాదేవి బృందాన్ని ఆయన అభినందించారు. జాతీయ నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా వైద్య ఆరోగ్య సేవల్ని మెరుగు పర్చాలని కమీషనర్ ఈ సందర్భంగా సూచించారు. వైద్య ఆరోగ్య , వైద్య విద్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ , స్పెషల్ సియస్ ఎం.టి.కృష్ణ బాబుల దిశానిర్దేశం మేరకు వైద్య ఆరోగ్య శాఖకు ప్రజల్లో గుర్తింపు లభించేలా అంకిత భావంతో పని చేయాలని ఆయన కోరారు. గుంటూరు జిల్లా పొన్నూరు సిహెచ్ సీ, డ్రైవర్స్ కాలనీ యుపీహెచ్సీ , విజయనగరం జిల్లా గరివిడి పీహెచ్ సీ, కృష్ణా జిల్లా దొండపాడు హెల్త్ వెల్నెస్ సెంటర్ యన్ క్యూఏయస్ అవార్డుల్ని కైవసం చేసుకున్నాయి.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



**గుంటూరు , పెదకూరపాడు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విద్యతో విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చని పాఠశాల విద్యే విద్యార్థులకు తొలిమెట్టు అని పుట్టినరోజునాడు ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేసి తమ దాతత్వాన్ని చాటుకోవాలని జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ అన్నారు. జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెద్దకూరపాడు మండలంలోని రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కారంపూడి భాగ్యలక్ష్మి,రాజశేఖర్ దంపతుల కుమార్తె అలెక్స గ్రేస్ రెండవ పుట్టినరోజు సందర్భంగా అనవసరమైన ఆర్భాటాలకు తావివ్వకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి జన్మదినాన్ని నిర్వహించుకోవడం హర్షించదగిన విషయమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. జోష్ పినమ్మ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన అలెక్సా గ్రేస్ తండ్రి పిడుగురాళ్ల శాఖా గ్రంథాలయ ఇంచార్జ్ లైబ్రేరియన్ రాజశేఖర్,నాయనమ్మ ఎస్ డబ్ల్యు కాలేజ్ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ రాణిమ్మలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శీలమనేని సాంబశివరావు,జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబులు పాల్గొన్నారు.

## పరిమితులకు లోబడి హుందాగా పనిచేస్తా.. స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్ ):** పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్పీకర్ పదవీ స్థానానికి మరింత గౌరవం పెరిగేలా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు.

ఇవాళ ఉదయం విచ్చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడును మర్యాద పూర్వకంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, ఎస్పీ మరళీకృష్ణలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం మీడియాతో అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ అతి చిన్న వయసులో ఎన్టీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు నాయుడు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు.

# ఎవరి వాటా ఎంత ?

- **పోలీస్ శాఖలో అక్రమార్కులకు అమృత హస్తాలు**
- **అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు కీలకమైన రాజధాని ప్రాంతంలో పోస్టింగులు**
- **వివాదస్పదమైన తుళ్ళురు పోస్టింగ్**
- **సీఎం వద్ద తేల్చుకుంటామంటున్న ప్రజాప్రతినిధులు**

**జోనల్ క్రైం బ్యూరో ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారింది. తెలుగుదేశం అధినేత నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. గత ఐదేళ్ళలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ వంటి హానికర మత్తు పదార్థాలు రాష్ట్రంలో విచ్చలవిడిగా చలామణి జరిగాయి. అనేక మంది యువత ఈ గంజాయి , డ్రగ్స్ కు బారిన పడి జీవితాలను ఛిద్రం చేసుకున్నారని , తమ ఎన్డీఏ ప్రభుత్వ హయంలో రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ నుంచి విముక్తి చేస్తామని చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సచివాలయంలో ఆయన ఛాంబర్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రకటించారు. అంతేకాకుండా పోలీస్ శాఖకు కూడా ఈ దిశగా ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

ఇది ఇలా ఉండగా గుంటూరు జిల్లాలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఆశయాలకు, లక్ష్యాలకు విరుద్ధంగా గంజాయి, డ్రగ్స్ ను ప్రోత్సాహించే అధికారులకు పెద్ద పెట వేస్తున్నారనే ఆరోపణలు పోలీస్ సిబ్బందే నుంచే వినిపిస్తున్నాయి. పోలీసు శాఖలో సమూలమైన మార్పులు తీసుకురావాలనే ప్రస్తుత ప్రభుత్వ ఆలోచన విధానానికి భిన్నంగా పోలీసు యంత్రాంగం ... కీలకమైన రాజధాని ప్రాంతంలోనే అది కూడా తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు అవినీతి ఆరోపణలతో వీఆర్ లో ఉన్న అధికారికి దర్యాప్తు నివేదిక రాకుండానే హడావిడిగా పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కీలకమైన రాజధాని ప్రాంత్రంలోని తుళ్లూరు పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై పోలీస్ వర్గాలతో పాటు, ప్రజా ప్రతినిధులు సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి నాయకులను అనేక రకాలుగా వేధించిన డీజీ సునీల్ కుమార్ కు ఈ అధికారి అత్యంత సన్నిహితుడు అని, సునీల్ కుమార్ సిఫార్సుతోనే ఈ అధికారికి పోస్టింగ్ దక్కిందనే ప్రచారం జరుగుతుండంతో ప్రజా ప్రతినిధులు భగ్గుమంటున్నారు.

కీలకమైన రాజధాని ప్రాంతంలో తుళ్ళురు ఎస్ హెచ్ ఓ గా డ్రగ్స్ కేసులో ఆరోపణలతో వీఆర్ లో ఉన్న అధికారిని ఎలా నియమిస్తారని... అది కూడా ఎన్డీఏ కూటమి మీద విపరీతమైన ద్వేషం ప్రదర్శించే డీజీ సునీల్ కుమార్ సిప్పార్సుతో ఆయన అనుంగ అనుచరుడి నియమించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ నియామకంతో ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ పెద్దల భద్రత ప్రశ్నార్ధక మైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో జరిగే చిన్న సంఘటన సైతం రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపిస్తుందని... ఇంతటి కీలకమైన చోట ఇటువంటి నియామకం ఏంటని మండిపడుతున్నారు. ఈ విషయం సీఎం దగ్గరే తేల్చుకునేందుకు ప్రజా ప్రతినిధులు సిద్ధం అవుతున్నారు.

గత ఏడాది గుంటూరు నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎనిమిది గ్రాముల అత్యంత ఖరీదైన డ్రగ్స్ డిసెంబర్ నెలలో పట్టుబడగా ...ఆ కేసును విచారించే క్రమంలో అప్పటి స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహించే ఈ అధికారి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సదరు అధికారిని అప్పటి ఉన్నతాధికారులు వీఆర్ కు పంపించి, శాఖా పరమైన దర్యాప్తుకు ఆదేశించారు. ఆ దర్యాప్తు నివేదిక రాకుండానే... ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఉన్న అధికారిని కీలకమైన రాజధానిలో పోస్టింగ్ ఇవ్వడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం మారినప్పటికీ కొంతమంది పోలీస్ ఉన్నతాధికారులు వైసీపీ నేతలనే తమ బాస్ గా భావిస్తుండటంపై ఎన్డీఏ ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు.

గతంలో అదే పూర్వ స్థానంలో చిల్లర వ్యాపారులు టోకు వర్తకుల నుండి నెలవారి మామూలు పెద్ద ఎత్తున వసూలు చేసిన వైనంపై ఇప్పటికీ నగరంలోని మార్కెట్ సెంటరులో కథలు కథలుగా చెప్పుకుంటారు. ఇతను ప్రకాశం జిల్లాలో ఎసై గా పని చేసేటప్పుడు కోత ముక్క ఎసై గా ప్రసిద్ధి గాంచారు. ఈ అధికారి కొండెపిలో సిఐగా సుమారు ఏడాడి పాటు పని చేశారు. ఆ తరువాత ఏ స్టేషనులో సైతం రెండు నెలలుకు మించి పనిచేయలేకపోవడం గమనించాల్సిన విషయం.

కీలకమైన రాజధాని ప్రాంతంలోనే ఇటువంటి ట్రాక్ రికార్డును నియమించడంతో... ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారులు పోస్టింగులో పోలీసు ఉన్నతాధికారులు ఏ విధంగాఅ వ్యవ్యహరించనున్నారో, రానున్న రోజుల్లో పోలీస్ శాఖ పనితీరు ఎలా ఉండబోతుందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## జులై ఒకటో తేది నుంచి కాకినాడ జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటన



**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకినాడ జిల్లాలో పర్యటించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రెడి అయ్యారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల అయింది. జులై 1వ తేదీ నుంచి 3 రోజుల పాటు పవన్ కళ్యాణ్ పర్యటన ఉండబోతుందని ప్రకటించారు. తొలి రోజు గొల్లప్రోలులో పెంచిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.. ఆ తర్వాత పిఠాపురం జనసేన నేతలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, జులై 2వ తేదీన కాకినాడ కలెక్టరేట్ లో పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

అదే రోజు సాయంత్రం జనసేన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఇక, జులై 3న ఉదయం ఉప్పాడ కొత్తపల్లి సముద్ర ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం పిఠాపురంలో వారాహి కృతజ్ఞతా సభలో ఆయన ప్రసంగించనున్నారు.

## జిఎడిలో రిపోర్ట్ చేయండి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ముగ్గురు అఖిల భారత సర్వీసు అధికారులను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఓఎస్డీ బి.అనిల్ కుమార్ రెడ్డి, ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఇన్కాప్ ఎండీ నీలకంఠారెడ్డి, సంప్రదాయేతర ఇంధన వనరులు కార్పొరేషన్ ఎండీ నంద కిషోర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ ముగ్గురిని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## నాన్నతో డీఎస్ అనుబంధం మర్చిపోలేను : జగన్



(పొలిటికల్ డెస్క్, జర్నలిస్ట్ ఫైల్ ): సీనియర్ రాజకీయ నేత డి. శ్రీనివాస్ మరణంపై వైసీపీ చీఫ్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన తండ్రి రాజశేఖర్ రెడ్డితో డీఎస్ కు ఉన్న అనుబంధం మర్చిపోలేనిదని వ్యాఖ్యానించారు. ఎన్నో పదవులు సమర్థవంతంగా నిర్వర్తించి చాలా రాజకీయ నాయకులకు డీఎస్ ఆదర్శప్రాయుడిగా ఉన్నారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## అడ్డగోలు బదిలీలపై విచారణ జరపాలి

- **నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల కోడ్ కు మునుపు జరిగిన ఉపాధ్యాయ అక్రమ బదిలీలపై విచారణ జరపాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ,అధ్యక్ష కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస రావులు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్రమ బదిలీల దందాలో కోట్ల రూపాయలు ఉపాధ్యాయుల నుంచి దోచుకున్నారని ఆరోపణలు బహిరంగంగా ఉపాధ్యాయులు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పై స్థాయిలో పలువురు ఉన్నతాధికారులు భాగస్వామ్యం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయని చెబుతూ ఈ ఉపాధ్యాయ అడ్డగోలు బదిలీల నందు పాత్రదారులైన అధికారులపై, రెండు సంఘాల నాయకుల పాత్ర పై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులైన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. అవినీతికి పాల్పడుతున్న ఆ రెండు సంఘాల రికగ్నిషన్ ను రద్దు చేయాలని విన్నవించారు.

## ఏపిటిఎఫ్ 80 వసంతాల 20వ విద్యా వైజ్ఞానిక మహాసభల కరపత్రం విడుదల



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపిటిఎఫ్ సుదీర్ఘ ప్రస్థానాన్ని అభినందించిన మంత్రి ... సంస్థ 80 ఏళ్ళు పూర్తి చేసుకొన్న సందర్భంగా ఏపిటిఎఫ్ నాయకులను అభినందించారు. అక్టోబరు నెలలో విజయనగరంలో జరగబోయే 80 వసంతాల మరియు 20వ విద్యా వైజ్ఞానిక మహాసభల కరపత్రాన్ని మంత్రి విడుదల చేయడం జరిగింది. మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంగా ప్రభుత్వం అన్ని శాఖలు – అన్ని అంశాల పట్ల శ్వేత పత్రం విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యారంగంపై కూడా శ్వేత పత్రం విడుదల చేయాలని ఏపిటీఎఫ్ ప్రభుత్వానికి సూచన చేసింది.

ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, యస్.చిరంజీవి, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి.సత్యనారాయణ,రాష్ట్ర కార్యదర్శి డి.దస్తగిరి, కృష్ణా జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్.రామబ్రహ్మం, ఎన్.టి.ఆర్ జిల్లా అధ్యక్షులు డి.రవీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మహానంది క్షేత్ర పరిసర ప్రాంతాల్లో మళ్లీ చిరుత కలకలం



**కర్నూలు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. చిరుతపులి మహానంది క్షేత్రంలోని పరిసర ప్రాంతంలోనే తిరుగుతుండటంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. క్షేత్రం పరిసర ప్రాంతాల్లోనే చిరుత తిరుగుతున్నట్లు ట్రాప్ కెమెరాల్లో విజువల్స్ రికార్డ్ అయ్యాయి. ఇక, మహానందిలోని గోశాల దగ్గర చిరుత రాత్రి సంచరించినట్లు అక్కడి సీసీటీవీల్లో కనిపించింది. అయితే, అక్కడి చిరుత వచ్చి కాసేపు తిరిగి వెళ్లడం కెమెరాల్లో రికార్డవ్వడంతో స్థానికులను, భక్తులను ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. స్థానికులు ఎవరూ వారి పెంపుడు జంతువులను బయటకు వదలద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. మహానంది పుణ్యక్షేత్రంలో రాత్రి వేళ భక్తులు బయట పడకోవద్దని కూడా మైకుల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరో వైపు అటవీ శాఖ అధికారులు చిరుత అక్కడే సంచరిస్తుండటంతో దానిని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో మహానందికి వెళ్లే భక్తులు రాత్రి వేళ అప్రమత్తంగా ఉండాలని ఆలయ అధికారులు హెచ్చరిస్తున్నారు. చిరుత భయం వేళ మహానందికి వెళ్లే ప్రజల తాకిడి తగ్గుతోంది.

## 260 కేజీల గంజాయి స్వాధీనం



**చోడవరం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలో శనివారం ఉదయం 260 కేజీల గంజాయి స్థానిక పోలీసులకి పట్టుబడింది. గంజాయితోపాటు రవాణాకు వినియోగిస్తున్న వాహనాన్ని పోలీసులు స్టేషన్కు తరలించారు. గంజాయి తరలింపులో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. వివరాలు సమగ్రంగా తెలియవలసి ఉంది. గంజాయి విలువ 13 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467